* మా న్స *

# ఒక లేఖ

★

ప్రియమైన కోటీ,

ఏవో నాకు తెలీని భావాలు...నా ఊహాపరిధుల్ని దాటి ఇంకా ఇంకా విశాలంగా పరుచుకొని ఎక్కడికో కూడా తెలీకుండా పరిగెడుతూన్న ఆలోచనలు పుటుక్కున తెగి నీకీ ఉత్తరం రాయిస్తున్నాయి

నిన్న సాయంత్రం ఎక్కడెక్కడో విశాఖబీచిలో తిరిగి తిరిగి ఇల్లు చేరుకున్నాను... దూరాన సంద్రంలోకి పొడుచుకొచ్చిన కొండలాగ ఏదో తెలీని నిరాశా... నిస్పృహతో గదిలో అడుగు పెట్టాను. ఆంధ్రదేశం అంతా ఆవరించిన చలి మేఘాలల్లే ఆలోచనలు మెదడునంతా కలిచివేస్తున్నాయి.

నిన్న క్రిష్ణనుంచి ఉత్తరం వచ్చింది రెండేళ్ళనుంచి ఆమెను గురించి ఆలోచించటమైనా లేదు. ఆమె ఎక్కడుంటోందో...ఏమిచేస్తోందో . ఎలావుందో నాకేమీ తెలీదు... జీవితంలో ఎంతో దూరం కలిసి ప్రయాణంచేశాక పెద్దరైల్వే జంక్షన్‌లో విడిపోయినట్లు విడిపోయాం. మరిచిపోదామని నిశ్చయించుకొని కృతకృత్యుణ్ణయ్యాను.

వణుకుతూన్న వేళ్ళతో కవరువిప్పాను. అసలామె ఎందుకు రాసిందీ ఉత్తరం నాకు? దూరాన మెరుస్తూన్న విశాఖ సముద్రంమీద నల్లని మేఘాలు పరుచుకున్నట్లు నీలి కాగితంమీద అక్షరాలు కదులుతున్నాయి...

"...ఎంతో కాలమైంది నీ కుత్తరం రాసి...నిజానికి నేనీ ఉత్తరం రాయబోతున్నప్పుడు ఇది ఎవరికి పోస్టుచేస్తామా అని ఆలోచించనేలేను. ఉత్తరంమీద నీ ఎడ్రసే ఎందుకు రాశానో కారణం నాకు తెలీదు..." నేనూ కొత్త అర్థాలు భావాలు వెతకటానికి అంతకన్నా ప్రయత్నించలేదు...

ఆమె ఉత్తరంలో రాసింది నన్ను గురించి కాదు...తనని గురించి అంతకన్నా కాదు.. ఆమె ఉత్తరం ఆంధ్రదేశ చరిత్ర... ప్రజా ప్రభుత్వంలో ఆంధ్రసీమ అనుభవిస్తున్న సుఖసంపద... "నాలుగురోజులవుతుంది. రాత్రి చీకటిపడింది. పల్లెటూళ్లో రాత్రి. చాలా ప్రశాంతంగా వుంది. రైతుల ఇళ్ళల్లో వంట ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీధిలో అరుగుమీదకూర్చొని ఏమిటేమిటో ఆలోచిస్తున్నాను.

భాస్కరన్నయ్య ఎక్కణ్ణుంచో వచ్చి లోపలికిపోయాడు. రాత్రి తొమ్మిదవుతుంది. దూరాన ఎక్కడో పిల్లల ఏడుపు

• పల్లెగుండె •

వినిపిస్తోంది. ఆవులు అరుస్తున్నాయి కొట్టాల్లో. కీచురాళ్ళు అదేగోల పెడుతున్నాయి అంతా పల్లెటూరు నిశ్శబ్దంలో మరింత నిశ్శబ్దం కలగజేసే వాతావరణం

ఇంతలో కారుగోల వినిపించింది... "లారీ...లారీ...పోలీసులు" అంటూ వూళ్ళో జనం అంతా పరిగెత్తడం మొదలెట్టారు... చిన్నపిల్లలు ఎటూకాక చక గొల్లున ఏడవటం మొదలెట్టారు...అన్నం తింటూ భాస్కరం చెయ్యి కడుక్కోకుండా బయటపడ్డాను...

కొన్ని నెలలనుంచి వింటున్నాను పల్లెసీమలో పోలీసుల స్వైరవిహారం...అయితే మా వూరిమీద పోలీసులు వచ్చిపడటానికి పెద్ద కారణమేమీ కనిపించలేదు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే గ్రామములో పెద్ద కాంగ్రెసుపార్టీ వాళ్లు చిన్న కాంగ్రెసుపార్టీ వాళ్ళమీద కసితీర్చుకునేందుకు కమ్యూనిస్టులని నిందలుమోపారు... కమ్యూనిస్టు కావటమే మహా నేరమై పోయిందిక్కడ...స్వతంత్ర ఆంధ్రావనిలో ...అంతర్కితం అన్నాడట చౌదరి ఎవళ్ళతోటో..."మాదండ్రా మీ పని ఎంతసేపట్లో పట్టిస్తానో ... వెంకట్రామయ్యే వస్తాడుగా పోలీసులతో..."

అయినా యిప్పుడు ఆ గోలలోకి పోదల్చుకోలేదు. ఒక్క విషయం మాత్రం రాసి ముగిస్తాను

ఇల్లూ యిల్లూ గాలిస్తున్నారు పోలీసులు...మొగాళ్లెవళ్ళూ దొరకలేదు. మా యిల్లు చేరువైంది ... పక్కయింటిమీద పడ్డారు...

"ఏమయ్యాడు...?"

"తెలీదు...నాకేం తెలుస్తుంది?"

ఏం! మీటింగు వాడు తెలుస్తుందేం ...మైకుకి ఎక్కడనించో ఊడిపడతాడు ...చెప్పు ఎక్కడికి వెళ్ళాడో...దొడ పగలగొట్టించేస్తాను..." చౌదరి

"మూస్తారేమిట్రా రాస్కెల్స్" అరిచాడు ఇనస్పెక్టర్

అంతే...శేషమ్మ వంటిమీద చింత బరికెలు ... తొమ్మిది మాసాల గర్భంతో వున్న శేషమ్మ ఒళ్ళంతా చితికిపోయింది. కదలలేదు శేషమ్మ...ఏదో తెలీని ఆవేశంలో...ఎందుకో తెలీని ఉద్రేకంతో... కదలలేదు...కడుపులో నొప్పులారంభమయ్యాయి ... కళ్ళు మైకం కమ్ముకొన్నాయి.

"మూడోసారి అడుగుతున్నాను ... చెప్పవా..."

మూడుసార్లు కాదు...మూడు వందల సార్లు అడిగినా శేషమ్మకు వినిపిస్తేనా! లేచి నిలబడటానికి ప్రయత్నించింది... ఎవడో...లాఠీలతో కడుపులో పొడిచాడు...పవిత్ర మాతృదేవిని...జీవితంలో ఎన్నో ఆశల...కలల ఫలితాన్ని...ఏ దౌర్భాగ్య తల్లి కన్న క్షుద్రుడో....పొడిచాడు.

కూలిపోయిందామె...చితికిపోయి... నరనరమూ పట్టు తప్పి బంతిలా నేలమీద పొర్లాడింది....రక్తం జీరలుకట్టి నేల మీద ప్రవహిస్తోంది.

"చచ్చిందా ... ముండ..." చౌదరి గబగబ బయటకు నడిచాడు తన బాధ్యతంతా తీరినట్లు.

"లేదు...చావలేదు...చావలేదు .." చావు తెలివిలో అరిచి అరిచి ఒళ్ళు తెలీకుండా వచ్చిన గుర్తుని కని శేషమ్మ... కాదు ఆంధ్రదేశం...ఆంధ్రదేశం...ఆంధ్రదేశపు పల్లెసీమ ప్రాణాలు విడిచింది...."

నాకు తెలుసు నువ్వెంత బాధపడతావో...దూరాన ఏదో చోటవుండి ఆంధ్రుడివన్న పౌరుషంతో బతుకుతున్న నిన్ను ఎంత కష్టపెడుతుందో ఈ వార్త నాకు తెలుసు...

కృష్ణ ర సింకె ఒకనాటి సాయంకాలం ఏదో పల్లెలో జరిగిన ప్రత్యేక ఘట్టంకాదు.

ప్రభుత్వ పరిపాలనకు ట్రేడుమార్కు చింతబరికెగా మారింది...నిత్యం ... ప్రతి ఘడియా...ప్రతి పల్లెటూరులోనూ. ఇదే దృశ్యం...ఎక్కడ చూసినా, ఎవరేమనుకొనేది విన్నా...ఇదే విషయం.

ఎందుకో తెలీకుండా...రైతులు ఏ భవిష్యత్తుకోసం దాచుకున్న ఆస్తులో నేలలో పొర్లాడుతున్నాయి...సంవత్సరం బ్రతుకు కోసం దాచుకున్న ఊరగాయలన్నీ కిరసనాయిలుతోటీ బొగ్గుతోటీ కుళ్ళి పల్లెలన్నీ కంపుకొడుతున్నాయి.

గ్రామాలన్నీ బీడుపోయి...నిర్జనంగా చిన్నపోయాయి...పూర్వంలాగ రాత్రి ఏ పదిగంటలకో ఏ యింట్లోంచో వినవచ్చే నాటకం పాటలు వినపట్టంలేదు... అమాయకమైన నవ్వు వినపట్టంలేదు ... ఏ వీధిలోంచి పోయినా...సన్నని వెక్కి వెక్కి ఏడుపు - ప్రతి యింటిలోంచీ శవం పోయిన దుఃఖం.

ఏజాతి అభ్యున్నతి కిదంతా? ఏదేశం శాంతి భద్రతలకు? నిజమేనా అనిపిస్తోందా, కోటీ, నీకిదంతా?

ఒక్కసారి ఆంధ్రదేశం రా ... ప్రతీ రైలులోనూ...ప్రతీ కారులోనూ...ప్రతీ బండిలోనూ...నడిచి దూరదూరంగాపోయే ప్రతీ ఆంధ్రుడి కళ్ళల్లోకి చూడు కోటీ... అగుపించే నిరాశా...తీవ్రమైన ద్వేషం... సమయంకోసం వేచివున్న పట్టుదలా... నీడల్లే మెదుల్తాయి వాటిల్లో...

రెండువందల ఏళ్ళు నిర్బంధంలో నలిగిన ఆంధ్రరైతు రెండేళ్ళలో నాలుగొందల ఏళ్ళకైనా తేరుకోలేని నిర్బంధానికి గురయ్యాడు...కాని ప్రతివాడి కళ్లూ రెండోవాడి కళ్ళల్లోకి ధీమాగానే చూస్తున్నాయి. నిబ్బరంగా ఆంధ్రసీమ ముందుకే ముందు ముందుకే చూస్తోంది కోటీ...

అదే జ్యోతి ... అదే మెరుపు ... మరింత గట్టిగా విశాలాంధ్రకి మేలుకొలుపు పాడుతోంది.

యుగయుగాలుగా సంస్కారం లేని తెలంగాణా పేదరైతు, కత్తికి కత్తి ఎదురొడ్డి నాటుతుపాకులతో నైజాం మూకల్ని బైటికి పారదోలి ప్రజాస్వామ్యాన్నేర్పరచుకున్న తెలంగాణా రైతు పళ్ళల్లోంచి కారుతున్న రక్తంతో అడిగాడు, ఆంధ్ర రైతుని హేళనగా..."తెలిసిందా పీడకుల నిజం...బాధితుల ఆశయం..."

ఎంతో దూరంనుంచి గబగబ ముందుకు నడిచి తెలంగాణా రైతు ఆంధ్రుణ్ణీ ఆంధ్రదేశపు ప్రతి రైతునీ ప్రేమతో గట్టిగా కౌగలించుకున్నాడు...!

మిలటరీ లారీలు కదిలాయి... నైజాం కోసం కాదు కోటీ... కానే కాదు. నాలుగు రోజుల్లో బయటుపడిందంతా... దొంగలూ దొంగలూ కలిశారు... ఊళ్ళు పంచుకోవడమే మిగులు...

పల్లెటూళ్ళల్లో మళ్ళా నిశ్శబ్దం ఆవరించింది... ప్రతీ పల్లెటూళ్లోంచీ హారన్ చప్పుడు చేసుకుంటూ లారీలు పరిగెడుతున్నాయి... కొత్తగా కాంగ్రెసుమతం పుచ్చుకున్న పెద్దమనుషులు...... గుసగుసలు...ఎవడి పేరో వాళ్ళ నాలిక ఉచ్చరిస్తుంది... ఎవడి తల్లో... తండ్రో... ఏ తల్లి కొడుకో...కూతురో తనకి తెలీని తప్పిదానికి...తను నమ్మిన ఆశయంకోసం ఆంధ్రసీమలో కూలిపోతున్నారు.

కాని ఆంధ్రసీమ బతుకుతోంది. బతికే హక్కుంది కనక...నందనవనం కాలుతోంది కోటీ... కాని మళ్ళీ పువ్వులు పూస్తాయి. మళ్ళీ రైతులు పంటలు కోసి ధైర్యంగా యిళ్ళకు తెచ్చుకుంటారు. మళ్ళీ యేయింటిలోంచో శలవులకు యిళ్ళకు తిరిగొచ్చిన విద్యార్థుల పాటలు ... నవ్వులు వినిపిస్తాయి...రాత్రిపూట మర్రిచెట్టుకింద బాలవీరులు ధైర్యంగా ఆడుకుంటారు... రాత్రిపూట మన అమ్మలు అమ్మమ్మలు వీధుల్లో కూర్చుని ఖులాసాగా కబుర్లు చెప్పుకుంటారు

ఆంధ్రదేశం కసితో రాజుకుంటోంది బాధతో ఆవేశంతో ఆంధ్రదేశం వేసవి గాడ్పులాగ ఊగిపోతూంది. సామ్యవాదాన్ని ప్రసవించ పోతున్న ధనికవాదం పిచ్చిపిచ్చి కేకలేస్తోంది...

మళ్ళీ కొత్త జీవితానికి పునాదులు వెయ్యమని...తన శిశువుని నవ్వే పువ్వుల్తో అలంకరించమని...ఈనాడు దీనంగా అరుస్తున్న ప్రతియింటి దీపం...మన అమ్మ కోర్కెని జ్ఞాపకం చేస్తున్నాయి.

మళ్లా పల్లెలోంచి పోలీసు లారీలు సాగుతున్నాయి. కొత్తగా కాంగ్రెసు మతం పుచ్చుకొన్న వాళ్లు పిచ్చెత్తినట్లు... ఇదుగో ఈ యిల్లే... |అదుగో ఆయిల్లు ఇటూ అటూ చూపిస్తున్నారు... కారు ఆగుతుంది లారీలతో...ముందుకు సాగుతుంది...

ప్రతి యింటిలోనూ...ప్రతిపల్లెలోనూ ప్రతీహృదయంలోనూ కసిరాజుకుంటోంది.. ప్రతిహృదయంలోనూ రక్తం ప్రతీకారం కోసం ఉడుకుతోంది...అగ్ని రాజుకుంటోంది...

చాలా త్వరలోనే వింటావు శుభవార్త! కోటీ...

---

"ఎంత భయంకర హింసాకాండను ప్రయోగించినా మానవజీవితం అక్షయమైనదే. ఒకమూల ధ్వంసమైతే వందచోట్లనుంచి పుట్టి పెరుగుతుంది."

— ఫ్యూజిక్

---